APTEL/25/A2326

# ప్రజలకి చేరువ
సామాన్యుడి ఆయుధం



పంపుటి : 1 | సంచిక : 17 | ఒంగోలు | శుక్రవారం 19-9-2025 | ఎడిటర్ : కుమార్ | పబ్లిషర్ : నరాల మురళి | పేజీలు : 4 | వెల : రూ. 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar



### అన్నదాత'పై ప్రధాని నరేంద్ర మోదీ
## ప్రశంసలు జల్లు

**ఈటీవీ 30 ఏళ్ల సంబరాల వేళ**
**ప్రధాని మోదీతో రామోజీ గ్రూప్ ఛైర్మన్ కిరణ్ భేటీ**

**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :**
వ్యవసాయదారులకు పంటల సాగు గురించి సమస్త సమాచారాన్ని అందించే అన్నదాత కార్యక్రమంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. గతంలో ఈటీవీ గుజరాతీలో ప్రసారమయ్యే అన్నదాత ప్రోగ్రాం అంటే తనకెంతో ఇష్టమని మోదీ అన్నారు. రైతులకు ఎంతో విలువైన సమాచారం అందించే ఈ కార్యక్రమాన్ని ప్రతీరోజూ క్రమం తప్పకుండా చూసేవాడినని ప్రధాని

మిగతా 2లో

## బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం 'సైన్యం'

**అవకాశం వస్తే పాక్‌పై తీవ్రంగా దాడి చేస్తాం : సీడీఎస్ అనిల్ చౌహాన్**
**ఝూరండ్ పర్యటనలో సీడీఎస్ అనిల్ చౌహాన్- ఆపరేషన్ సిందూర్‌పై కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :**
బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం సైన్యమేనని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. దేశానికి సేవ చేయాలంటే త్రివిధ దళాలల్లో చేరాలని విద్యార్థులకు సూచించారు. ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడుతూ, అవకాశం వస్తే మరింత కఠినమైన దాడి

మిగతా 2లో

## ఓట్ల దొంగలను ఎన్నికల సంఘం రక్షిస్తోంది

**ఉద్దేశపూర్వకంగానే లక్షలమంది ఓట్లు తొలగిస్తున్నారని రాహుల్ విమర్శ**




**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :**
ఓట్లు తొలగించేందుకు కొందరు వ్యక్తులు వ్యవస్థను హైజాక్ చేస్తున్నారని కాంగ్రెస్? అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓట్ల దొంగలను ఎన్నికల సంఘం రక్షిస్తోందని విమర్శలు గుప్పించారు. ఉద్దేశపూర్వకంగానే లక్షల మంది ఓట్లు తొలగిస్తున్నారని, చాలా చోట్ల మైనారిటీలు, ఆదివాసీల ఓట్లు తొలగించారని తెలిపారు. ఇవన్నీ

మిగతా 2లో




### లిక్కర్ కేసులో తెర వెనుక
# ఏం జరుగుతోంది

**వైసిపి హయాంలో జరిగిన లిక్కర్ కుంభకోణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి దాదాపు సంవత్సరం అవుతుంది**

**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** వైసిపి హయాంలో జరిగిన లిక్కర్ కుంభకోణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి దాదాపు సంవత్సరం అవుతుంది. ఈ కోణంలో అనేక మందిపై కేసు నమోదు చేశారు. 42 మందిని నిందితులుగా పేర్కొన్నారు. అదేవిధంగా చాలామందిని అరెస్టు కూడా చేశారు. ప్రస్తుతం ఎంపీ మిధున్ రెడ్డి జైల్లోనే ఉన్నారు. ఇవన్నీ పైకి కనిపిస్తున్న విషయాలు. అయితే, చిత్రం ఏంటంటే ఈ కేసును సిబిఐకి అప్పగించాలని అదేవిధంగా ఈ కుంభకోణం ద్వారా జరిగిన నిధుల గోల్మాల్ విషయాన్ని ఈడీకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం కొన్నాళ్ల కిందటే నిర్ణయించుకున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి ఈ డిమాండ్ కొన్నాళ్లుగా మంత్రులు.. పార్టీ నాయకులు మధ్య కూడా వినిపించింది. ఇక వైసిపి విషయానికి

మిగతా 2లో



### జీఎస్టీ 2.0 సంస్కరణలకు
## సుస్వాగతం

**మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు**
**జీఎస్టీ సంస్కరణలపై శాసనసభలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :**
జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ అందించేలా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. దీని కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలపై ఈనెల 22న యాక్షన్ ప్లాన్ తయారు చేస్తామని ప్రకటించారు.

జీఎస్టీ 2.%వా%.ని స్వాగతిస్తూ శాసనసభలో జరిగిన చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జీఎస్టీ నూతన విధానం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సంస్కరణలకు ఎప్పుడూ తాను మద్దతిస్తానన్న సీఎం, అందుకే జీఎస్టీ 2.0ని స్వాగతిచ్చినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్నా తనకు దేశం, రాష్ట్రం, ప్రజలే ముఖ్యమని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ సంస్కరణలతో పరోక్ష పన్ను చెల్లింపుదారులు పెద్దఎత్తున పెరిగారని సీఎం తెలిపారు. కొత్త పన్నుల వినియోగం పెరిగి, ఆర్థిక వ్యవస్థకు

మిగతా 2లో

### వైఎస్ జగన్
## భయపడుతున్నారా ?



**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :**
వైసీపీలో భయం ఎవరికి అయినా ఉందా అంటే లేదు అన్న జవాబు వస్తుంది. వైసీపీ నాయకులు అయినా క్యాడర్ అయినా తమ గొంతును బలంగా వినిపిస్తారు. వెన్ను చూపి వెనక్కి పోయే నైజం వైసీపీలో అధినాయకుడికే లేదు అని అంటారు. కేంద్రంలో రాష్ట్రంలో బలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న రోజులలోనే ఆ కాంగ్రెస్ ని ఎదిరించి మరీ బయటకు వచ్చిన వారు జగన్. ఏకంగా అయిదేళ్ల పాటు కాంగ్రెస్ తో ఏపీలో బలమైన పార్టీగా ఉన్న టీడీపీతో పోరాడి మరీ చిచ్చర పిడుగు మాదిరిగా ఉమ్మడి ఏపీలో విభజన ఏపీలో తన రాజకీయ ప్రభావాన్ని ప్రతాపాన్ని నిండుగా మెండుగా చూపించిన వారు వైఎస్ జగన్ అని

మిగతా 2లో

### సమిష్టిగా పని చేసి ప్రజలకు
## మెరుగైన సేవలు అందిద్దాం

**ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు**

**శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా విధులు నిర్వర్తించాలి**
**జిల్లాలో పారదర్శక, నిష్పక్షపాత పోలీసింగ్**
**ప్రజల సమస్యల పరిష్కార కృషిపై దిశానిర్దేశం**



**ప్రకాశం, ప్రజలకి చేరువ ప్రతినిధి :** నూతన బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ గురువారం ప్రకాశం జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సి.ఐలు, పోలీసు అధికారులతో పోలీస్ కార్యాలయంలో గెలాక్సీ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ పరిధిలో గల పరిస్థితులు, బౌగోళికల ప్రదేశాల గురించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంశాలు, సర్కిల్ పరిధిలో పోలీస్ స్టేషన్ లు, వారు పనిచేయుచున్న కాలపరిమితి, జిల్లా సరిహద్దు ప్రాంతాల వివరాలు, కేసులు ఎక్కువగా నమోదు అయ్యే ప్రాంతాల వివరాలు గురించి సంబంధించి అధికారులతో జిల్లా ఎస్పీ చర్చించారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీస్ అధికారి నిరంతరం అప్రమత్తంగా ఉండి, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తూ, జవాబుదారీ తనంతో విధులు నిర్వర్తించాలన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలైన పేకాట, కోడిపందాలు, మట్కా, సింగిల్ నంబర్ వంటివి జరగకుండా చర్యలు తీసుకుంటూ

మిగతా 2లో



## కనిగిరి అభివృద్ధే ధ్యేయం

**రోడ్లు అభివృద్ధికి నిధులు ఇచ్చి సహకరించాలని మంత్రిని కలసినఎమ్మెల్యే ముక్కు**

**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** కనిగిరి అభివృద్ధే నా మొదటి లక్ష్యం అని ఎమ్మెల్యే డా.. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరి నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధికి నిధులు ఇచ్చి సహకరించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డిని గురువారం కలిశారు.నియోజకవర్గంలో రహదారి సదుపాయాల కోసం వినతిపత్రం అందజేసి నిధులు మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు రహదారి సమస్యతో ప్రజలు

మిగతా 2లో

### మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో
## స్వచ్ఛత హీ సేవ



**కనిగిరి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** స్వచ్ఛత హీ సేవ" కార్యక్రమం లో భాగ ంగా "స్వచ్ఛోత్సవ్" ప్రత్యేక కార్యక్రమమును చేయుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన కనిగిరి పురపా లక సంఘం పరిధిలో మునిసిపల్ కమిషనర్ పి.కృష్ణ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలు బస్టాండ్ చెక్ పోస్ట్ నుండి హైవే రోడ్డు వరకు ప్రధాన వీధులను శుభ్రపరిచారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రజారోగ్య కార్మికులు ఉన్నప్పటికీ ప్రజల భాగస్వామ్యం ఉం టేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొ న్నారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఇటువంటి కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని కోరారు.అప్పుడే గాంధీజీ కలల కన్న స్వచ్ఛ భారత్ సాధ్యమవుతుందని వివరించారు. హాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రతి ఏడాది స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశుభ్రత అంటే మన కుటుంబం,మన సమాజంను అనారోగ్య సమస్యల నుండి రక్షించుకోవడమే అన్నారు. స్వచ్ఛత హి సేవాను అందరూ అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, సచివాలయం శానిటరీ సెక్రటరీలు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకి చేరువ
సామాన్యుడి ఆయుధం

# సంపాదకీయం

## ప్రజల హక్కులు గౌరవిస్తేనే సుస్థిరత

ఇటీవల కాలంలో మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక, పాకిస్థాన్ వంటి దేశాలలో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా నేపాల్‌లో ప్రజల తీవ్ర ఆందోళనల మధ్య ఆ దేశ ప్రధానమంత్రి రాజీనామా చేయవలసి వచ్చింది. దానికంటే ముందు బంగ్లాదేశ్‌లో కూడా అలాంటి ఆందోళనల మధ్య ఆ దేశ ప్రధాని రాజీనామా చేసి, భారతదేశంలో తలదాచుకోవాల్సి వచ్చింది. కొన్ని సందర్భాలలో ఆందోళనలు అరాచకరూపం కూడా తీసుకున్నాయి. ఈ ఆందోళనల వెనక ఉన్న ప్రధానమైన కారణం ఆ దేశ ప్రజల సమస్యలు పెరగడం, వాటిని పరిష్కారం చేయకపోగా, ఆయా పాలకులు ప్రజల అసంతృప్తిని అణచివేయడానికి చేసే ప్రయత్నాలే ప్రధానంగా కనపడతాయి. నేపాల్‌లో వాస్తవంగా గత దశాబ్దంన్నర కాలంలో చాలా చ్కైతన్యవంతమైన మార్పులు చోటు చేసుకున్నాయి. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్యం వైపుగా ఆ దేశం అడుగులు వేసింది. సాయుధ పోరాట మార్గాన్ని వదిలి మావోయిస్టు పార్టీ కూడా ప్రధాన జీవన స్రవంతిలో కలిసి ఎన్నికలలో భాగస్వాములు కావడం వంటి అనేక పరిణామాలు ఆ దేశంలో చోటుచేసుకున్నాయి. అయితే వరుసగా ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం చేయడంలో విఫలమయ్యాయి. దీనికి తోడు ప్రజల అసంతృప్తిని అణచివేయడానికి తీవ్ర నిర్బంధ చర్యలకు కూడా పాల్పడ్డాయి. చివరకు సోషల్ మీడియా మీద కూడా నిషేధం విధించడంతో ప్రజల అసంతృప్తి కట్టలు తెంచుకుంది. అప్పటిదాకా ఓర్పుతో ఉన్న ప్రజానీకం ఒక్కసారిగా రోడ్లమీదకు వచ్చి తిరగబడింది. అది హింసా రూపం కూడా తీసుకుంది. దాదాపు ఇలాంటి పరిణామాలే బంగ్లాదేశ్‌లో కూడా గత సంవత్సరం చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా మన దేశంలోని పాలకులు ఈ పరిణామాల నుంచి నేర్చుకోవలసిన విలువైన పాఠాలు ఉన్నాయి. నేడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనతో దేశ ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక అసమానతలు, పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం, గిట్టుబాటు ధర, మహిళలపై అత్యాచారాలు, పరస్పర అపనమ్మకాలు వంటివి ఈ రోజు దేశంలో నిత్యకృత్యమయ్యాయి. ఇవన్నీ పాలకుల కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితాలే. వివిధ తరగతుల ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని అణచివేయడానికి ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తోంది. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను సుదీర్ఘకాలం పాటు విచారణ చేపట్టకుండా జైళ్లలో నిర్బంధించిన ఉదంతాలు ఉన్నాయి. ఇవన్నీ దేనికి సంకేతాలుగా నిలుస్తున్నాయి అన్నది పరిశీలిస్తే నేడు దేశంలో నెలకొన్న వాతావరణం అవగతమవుతుంది. ఇన్ని తీవ్ర సమస్యలు ఉన్నా మన దేశంలో పొరుగు దేశాలలో లాగా ఆందోళనలు ఎందుకు జరగడం లేదు అన్న సందేహం సహజంగానే కలుగుతుంది. దీనికి ప్రధాన కారణం ప్రజలలో అసంతృప్తి లేకపోవడం మాత్రం కాదు. దీనికి భిన్నంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ తాజాగా పేర్కొన్నట్లు మన రాజ్యాంగం విశిష్టతే దీనికి ప్రధాన కారణం. భారతదేశ రాజ్యాంగంలో ప్రజలకు నిరసన తెలిపే హక్కు, ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రజాస్వామ్య హక్కులు వంటివి అనేకం ఉన్నాయి.

(మొదటి పేజీ తరువాయి)

## ప్రశంసలు జల్లు

తెలిపారు. ఈనాడు దినపత్రిక 50 సంవత్సరాలు, ఈటీవీ 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, ఈటీవీ సీఈవో బాపినీడు దిల్లీలో ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధానిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలను సీహెచ్ కిరణ్, బాపినీడు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. ప్రధానితో జరిగిన సంభాషణలో ఈటీవీ తెలుగులో అన్నదాత కార్యక్రమం ఇప్పటికీ ప్రసారమవుతోందని సీహెచ్ కిరణ్ తెలిపారు. ప్రియాఫుడ్స్ ఇటీవల ఆవిష్కరించిన సబల చిరుధాన్యాల ఉత్పత్తుల వివరాలను ప్రధాని మోదీకి కిరణ్ వివరించారు. వీటిపై విలువైన సలహాలివ్వాలని మోదీని కోరగా అందుకు ప్రధాని అంగీకరించినట్లు కిరణ్ వెల్లడించారు. చిరుధాన్యాల రైతులను ప్రోత్సహించడం ద్వారా పేద రైతులకు రామోజీ గ్రూప్ ఊతమివ్వడంపై ప్రధాని సంతోషం వ్యక్తం చేశారని, శుభాకాంక్షలు తెలిపారని సీహెచ్ కిరణ్ తెలిపారు.

## బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం 'సైన్యం'

జరుగుతుందిరింత పేర్కొన్నారు. ఝూరండ్‌పర్యటనకు వచ్చిన సీడీఎస్ అనిల్ చౌహాన్ గురువారం రాజ్‌భవన్‌లో స్కూల్ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

'బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం ఫౌజ్ (సైన్యం). మీరు దేశానికి సేవ చేయాలనుకుంటే, దేశంతో పాటు ప్రపంచాన్ని అన్వేషించాలనుకుంటే మీరు సాయుధ దళాలలో చేరాలని ఆకాంక్షించాలి. ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాల ఘటనలు చాలా జరిగాయి. ఈ క్రమంలోనే రెస్క్యూ ఆపరేషన్లలో అనేక మందిని రక్షించేందుకు సైన్యం తీవ్రంగా కృషి చేసింది' అని జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. సైన్యం ఎప్పుడూ దేశానికి నష్టం కలగకుండా కాపాడడమే ధ్యేయం. విజయం సాధించడానికి %×ు% కంటే ముఖ్యం. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు యువత కృషి చేయాలి' ఆయన పిలుపునిచ్చారు.

**ఆ దాడుల కంటే భిన్నం : సీడీఎస్**

ఇక ఆపరేషన్ సిందూర్ గురించి సీడీఎస్ అనిల్ చౌహాన్ మాట్లాడారు. మే 7న అర్ధరాత్రి శత్రు స్థావరాలపై దాడులు చేశామని చెప్పారు. ఒంటి గంటకు తొలి దాడిని నిర్వహించినట్లు తెలిపారు. 'సాధారణంగా తెల్లవారుజామున దాడులు జరుగుతాయి, కానీ ఆ సమయంలో ప్రజలు కదికలు ఉంటాయి. అప్పుడు దాడి జరిగే అమాయక ప్రజలు ప్రాణ నష్టం జరిగేది. అందుకే రాత్రి సమయంలోనే దాడి జరిగిందని నిర్వహించాం. దాడికి ముందు పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ కదలికలను పర్యవేక్షించాం. సైన్యం, వైమానిక దళం చెరో ఏడు లక్ష్యాలను ధ్వంసం చేశాయి. నావిక దళం కూడా ఇందులో పాల్గొంది. ఇది ఉరి, బాలాకోట్ దాడుల కంటే భిన్నం' అని వివరించారు.

రాత్రి వేళలో సుదూర లక్ష్యాలపై కచ్చిమైన దాడులు చేయడానికి ప్రత్యేక కృషి అవసరమని అనిల్ చౌహాన్ తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో జరిగిన ప్రతి దాడిలోనూ పాకిస్థాన్?ను నిర్ణయాత్మకంగా ఓడించాం. పహల్గాం దాడి తర్వాత టీఆర్?ఎఫ్ అనే ఉగ్రసంస్థ బాధ్యత వహించింది. ఆ లింక్?ను సోషల్? మీడియా నుంచి తొలిగించింది. ఉగ్రవాదులు సర్జల్ గ్రామం నుంచి ప్రవేశించారని దర్యాప్తులో తేలింది. వారు కశ్మీరీలు కాకుండా పాకిస్థాన్ భాష మాట్లాడారని వివరించారు. ఈ ఆధారాల ఆధారంగా టార్గెట్ నిర్ణయించాం. సాంకేతికత ద్వారా నడిచే యుద్ధం ఇప్పుడు సైబర్ వంటి కొత్త రంగాలకు విస్తరించింది' జనరల్ చౌహాన్ అన్నారు. పహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు పురుషులే లక్ష్యంగా చేసిన దాడిలో 26 మంది మృతిచెందారు. దీంతో ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్, పాక్?తో పాటు పీఓకేల్లోని ఉగ్రస్థావరాలపై దాడి చేసి వాటిని నేలమట్టం చేసింది. అనంతరం భారత్, పాక్ మధ్య ఘర్షణలు చెలరేగాయి. చివరికి భారత్ దెబ్బకు పాక్ తోక ముడిచి, సంధికి వచ్చింది.

## ఓట్ల దొంగలను ఎన్నికల సంఘం రక్షిస్తోంది

ఆరోపణలు కాదని, పక్కా ఆధారాలతోనే చెబుతున్నానని స్పష్టం చేశారు. కర్ణాటక అలంద్‌లో గోదాబాయి అనే మహిళ పేరుతో ఫేక్ లాగిన్ సృష్టించారన్న రాహుల్?, ఆమె మాట్లాడిన వీడియోను ప్రదర్శించారు. "ఉద్దేశపూర్వకంగానే లక్షల మంది ఓట్లు తొలగిస్తున్నారు. చాలా చోట్ల మైనారిటీలు, ఆదివాసీల ఓట్లు తొలగించారు. ఓట్ల తొలగింపుపై మా వద్ద ఆధారాలు ఉన్నాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో వేలమంది ఓట్లు తొలగించారు. అధికారులకు తెలియకుండా ఓట్లు ఎలా పోతాయి? ఓట్లు తొలగించేందుకు కొందరు వ్యక్తులు వ్యవస్థను హైజాక్ చేస్తున్నారు. ఓట్లు తొలగించాలంటూ వారికి తెలియకుండానే దరఖాస్తు చేస్తున్నారు. కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను కావాలనే తొలగిస్తున్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్నచోట్ల మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ వివిధ రాష్ట్రాల నుంచి కొనసాగుతోంది."

**రాహుల్ గాంధీ, లోక్?సభలో ప్రతిపక్ష నేత**

కర్ణాటకలో ఓట్ల తొలగింపుపై ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసిన C.I.D ఎక్కణ్నుంచి దరఖాస్తు చేశారో ఐపీ నెంబర్లు ఇవ్వాలని ఈసీని కోరినా ఇవ్వలేదన్నారు. 18 నెలల్లో సీఐడీ 18 లేఖలు రాసినా స్పందన లేదన్నారు. కర్ణాటక సీఐడీ అడిగిన వివరాలను వారంలోగా ఇవ్వాలని ఈసీని కోరుతున్నామన్నారు. ఓట్ల చోరులను రక్షిస్తోంది సీఈసీ జ్ఞానేష్‌కుమారేనని ఆరోపించారు. "ఓట్ల దొంగలను ఎన్నికల సంఘం రక్షిస్తోంది. మహారాష్ట్రలోని రజూరా అసెంబ్లీలో నకిలీ ఓట్లను సృష్టించారు. మహారాష్ట్ర రజూరాలో 6,850 నకిలీ ఓట్లను జాబితాలో చేర్చారు. ఓట్ల చోరీ పరిశ్రమ నిర్వాహకులు ఎవరో తేలాలి. ఉన్న ఓట్ల తొలగింపు, నకిలీ ఓట్లను సృష్టి రెండూ జరుగుతున్నాయి. నకిలీ ఓట్లు సృష్టిస్తున్నారనేందుకు ఆధారాలు ఉన్నాయి. ఓట్ల చోరులను రక్షించడం మానుకోవాలని సీఈసీని కోరుతున్నాం." అని రాహుల్ అన్నారు.

"కర్ణాటకలో అలంద్ ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఉంది. ఈ నియోజకవర్గంలో ఎవరో 6వేల 18 ఓట్లు తొలగించేందుకు ప్రయత్నించారు. 6వేల 18 ఓట్ల తొలగింపును ఒకరు గుర్తించారు. యాదృచ్ఛికంగానే అది జరిగింది. తన బంధువు ఓటు తొలగించారని బూత్ స్థాయి అధికారిణి గుర్తించారు. పక్కింటి వ్యక్తి ఓటు తొలగించారని ఆమె కనిపెట్టింది. ఇదే విషయాన్ని అతడిని ప్రశ్నించగా తాను తొలగించలేదని చెప్పారు. ఓటు ఉన్న వ్యక్తి లేదా అధికారి తొలగించకుండా ఓటు ఎవరు తీసేశారు. ఎవరో ఈ ప్రక్రియను మొత్తం హైజాక్ చేశారు. "

రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

కాంగ్రెస్ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఉన్న ఓట్లను తొలగిస్తూ కొత్తగా నకిలీ ఓట్లను ఎలా సృష్టిస్తున్నారో రాహుల్ గాంధీ వివరించారు. మహారాష్ట్రలోని రజూరా అసెంబ్లీ నియోజకవర్గంలో 6,850 నకిలీ ఓట్లను జాబితాలో చేర్చారని అన్నారు. కర్ణాటకలో ఓట్లు తొలగించేందుకు వివిధ రాష్ట్రాల ఫోన్ నెంబర్లు వాడారన్న రాహుల్‌గాంధీ, ఈ నెంబర్లు ఎవరివి? ఎవరు ఆపరేట్ చేశారో? తేలాలన్నారు. సూర్యకాంత్ పేరుతో 12 నిమిషాల వ్యవధిలో 14 దరఖాస్తులు వెళ్లాయన్న రాహుల్, ఆయనకు తెలియకుండానే ఓటు తొలగించాలని దరఖాస్తు చేశారని అన్నారు. ఫేక్ లాగిన్లు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తోనే ఓట్లు తొలగిస్తున్నారని రాహుల్ అన్నారు.

## వైఎస్ జగన్ భయపడుతున్నారా ?

ఎవరైనా అంటారు. జగన్ లో పట్టుదల ఉందా మొండితనం ఉందా లేదా దూకుడు ఉందా అంటే అన్నీ కలిసే ఉన్నాయని చెబుతారు. ఇవన్నీ కలసి జగన్ అంటే భయానికే భయం అని కూడా చెబుతారు. జగన్ పొలిటికల్ డిక్షనరీలో కానీ పర్సనల్ హిస్టరీలో కానీ భయం అన్న మూడక్షరాలకు ఎపుడూ ప్లేస్ లేదని కూడా అంటారు. ఢీ అంటే ఢీ అంటూ : కట్ చేస్తే వైసీపీ లో అంతా ఇపుడు రివర్స్ లో ఉందని అంటున్నారు చిత్రంగా కొత్త సీన్ వైసీపీలో కనిపిస్తోంది ఒక వైపు ఏమో వైసీపీ క్యాడర్ ఏమో ఢీ అంటే ఢీ అనే విధంగా గ్రౌండ్ లెవెల్ లో గట్టిగానే నిలబడుతున్నారు. ఓటమి నుంచే గెలుపు రుచిని అందుకోవాలని ఆరాటపడుతున్నారు జరిగింది గతం చూసేది బలమైన భవిష్యత్తు అని కూడా నమ్ముతున్నారు. అందుకే పదిహేను నెలల కూటమి పాలనలో తాము ఏ విధంగా నలిగిపోయింది రగిలిపోతున్నది అన్నీ చూసుకుని బేరీజు వేసుకుని మరీ జనంతోనే రాజకీయ కథని తేల్చుకోవాలని చూస్తున్నారు. వారికి కళ్ళ ముందు లోకల్ బాడీ ఎన్నికలు ఉన్నాయి దాంట్లోకి దిగి తమ సత్తా చాటుకోవాలని కూడా చూస్తున్నారు అని టాక్. జగన్ ఎందుకు అలా : ఇక పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలలో రిజల్ట్ చూసి జగన్ ఆలోచనలు మారాయని అని అంటున్నారు. ఒక విధంగా స్థానిక ఎన్నికలు కూడా దీనికి డిటో గానే ఉంటాయని ఆయన భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలలో ఎలక్షన్స్ అన్నది చేయనీయకుండా టీడీపీ కూటమి చేసింది కాబట్టి రాష్ట్రం అంతటా అలాగే చేస్తారు అని జగన్ భయపడుతున్నారు అని అంటున్నారు. ఇక వైసీపీ ప్రభుత్వంలో ఉన్నపుడు జగన్ కూడా స్థానిక ఎన్నికల్లో అలాగే చేశారు కదా అన్నది కూడా మేధావుల నుంచి రాజకీయ విశ్లేషకుల నుంచి మరో వైపు వినిపిస్తున్న మాట గా ఉంది. ఆఖరుకు కుప్పంలో కూడా జగన్ మార్క్ ఎలక్షన్స్ జరిపి చంద్రబాబుకు చుక్కలు చూపించిన వైనాన్ని గుర్తు చేస్తున్నారు. ఆనాడు ఎన్నికలు చేయనీయకుండా టీడీపీని వైసీపీ ఎలా అడ్డుకుందో కూడా అంతా గుర్తు చేసుకుంటున్నారు

వై నాట్ 175 స్లోగన్ : నిజానికి వై నాట్ 175 అన్న స్లోగన్ కూడా కుప్పం ఎన్నికల తరువాతనే పుట్టింది అని చెబుతారు. అధికారం చేతిలో ఉంది కాబట్టే కుప్పంలో గెలిచామన్నది వైసీపీ నేతలకు సోయి లేకపోయింది అని కూడా అంటారు. అందుకే అన్నీ గెలిచేశామని భ్రమపడి వై నాట్ 175 అనేశారు. కానీ టైటిల్ సూపర్ హిట్ సినిమా అట్టర్ ఫ్లాప్ అన్నట్లుగా ఈ స్లోగన్ తయారైంది అన్నది 2024 ఎన్నికల ఫలితాల తరువాతనే తెలిసింది మరి అని సెటైర్లు పడ్డాయి.

**కేంద్ర బలగాలు ఎందుకు :** ఇక లోకల్ బాడీ ఎన్నికలు అన్నవి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది రాష్ట్ర పోలీసులే ఈ ఎన్నికల్లో బందోబస్తు చూస్తారు. దీనికి కేంద్ర బలగాలు ఎందుకు వస్తాయి అని అంటున్నారు కేంద్ర బలగాలు వస్తే ఎన్నికలు సాఫీగా సాగుతాయని జగన్ అంటున్నారు కానీ ఆయన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా స్టేట్ పోలీస్ నే ఎన్నికలు నిర్వహించాయి అన్నది మరచిపోతే ఎలా అని అంటున్నారు.

**మోడీకి జై కొట్టినా :** ఇక ఎన్డీయే అభ్యర్థికి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసి జగన్ రాజకీయంగా తన రాంగ్ రూట్ ని ఎంచుకున్నారా అని కూడా అంటున్నారు. కేంద్ర బలగాలు అని అన్నా కూడా కేంద్రంలో ఉన్నది ఎన్డీయే కదా అని అంటున్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఏపీలో చూస్తే ఎ ఎన్డీయే లో భాగంగా ఉంది. వారు కూటమికే మద్దతుగా ఉంటారు కానీ జగన్ కి ఎందుకు సపోర్ట్ గా ఉంటారు అన్న ప్రశ్నలు వస్తున్నాయి. అదే జగన్ ఇండియా కూటమిలో ఉంటే కచ్చితంగా జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల మద్దతు జగన్ కి దక్కేది అని కూడా విశ్లేషిస్తున్నారు. కానీ వైసీపీ అనేది చెప్పేది ఏంటి అంటే కాంగ్రెస్ కి వ్యతిరేకంగా తమ పార్టీ పుట్టింది కాబట్టి ఆ పార్టీతో ఎలా కలుస్తుంది అని. అయితే రాజకీయాల్లో పరిస్థితులు ఎపుడూ ఒకేలా ఉండవు. 2011లోనే వైసీపీ ఉండిపోతే ఎలా అన్న చర్చ వస్తోంది. ఇపుడు ఉన్న పరిస్థితుల్లో ఎన్డీయేకు ఎంతగా పరోక్షంగా కానీ ప్రత్యక్షంగా కానీ సపోర్టు చేసినా ఫలితం అయితే ఉండదని అంటున్నారు

**క్యాడర్ కోసమైనా సరే :** ఇవన్నీ పక్కన పెడితే ప్రతీ ఎన్నిక ఒక యుద్ధం. ప్రతీ ఎన్నిక ఒక గుణ పాఠం. అందువల్ల ఎన్నికల్లో వైసీపీ పాల్గొనాల్సిందే అన్న మాట అయితే వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొంటేనే గెలుపు అయినా ఓటమి అయినా వైసీపీ క్యాడర్ పార్టీకి బలంగా ఉంటుంది. పైగా వారిలో కూడా ఒక పోరాట స్ఫూర్తి వస్తుంది. అది ముందు ముందు ఎన్నికలకు ఎంతోగానో ఉపయోగపడుతుంది అని అంటున్నారు. అలా కాకుండా బాయ్ కాట్ అన్న నిర్ణయం తీసుకుంటే మాత్రం వైసీపీకి అది రాజకీయంగా ఇబ్బందులను తెచ్చే పరిణామమే అని అంటున్నారు చేజేతులా గివ్ అప్ ఇచ్చేసినట్లు అవుతుందని ఆ మీదట వగచి వాపోయినా ఫలితం ఉండదని కూడా అంటున్నారు. మొత్తానికి క్యాడర్ కోసం వారిని ఉత్తేజం చేయడం కోసం పార్టీ కోసం జగన్ కచ్చితంగా స్థానిక ఎన్నికల్లో పాల్గొనాల్సిందే అన్న మాట అయితే ఇపుడు వైసీపీలో వినిపిస్తోంది అని అంటున్నారు.

## లిక్కర్ కేసులో తెర వెనుక

వస్తే ఏ దర్యాప్తు చేయించుకున్న తమకు అభ్యంతరం లేదని, ఇప్పటికిప్పుడు జైలుకు తీసుకువెళ్లిన తాను సిద్ధంగా ఉన్నానని వైసీపీ అధినేత జగన్ పదేపదే చెప్పిన విషయం కూడా తెలిసిందే. ఈ పరిణామాల క్రమంలో అసలు సిబిఐకి ఈడికి ఎందుకు ఇవ్వడం లేదు అన్నది ఆసక్తిగా మారింది. మరోవైపు ఛత్తీస్గడ్ సీఎం భూపేష్ బగల్ కుమారుడి విషయం తాజాగా వెలుగులోకి రావడంతో అక్కడ ఏం జరుగుతుందన్నది ఏపీ ప్రభుత్వం ఆరా తీసింది. ఛత్తీస్గడ్ లో కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారానే లిక్కర్ ని విక్రయించింది. అయితే, ఈ క్రమంలో సుమారు 2000 కోట్ల రూపాయల వరకు అక్రమాలు చోటు చేసుకున్నాయని అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం ఉన్న బీజేపీ ప్రభుత్వం దీనిపై సిబిఐ దర్యాప్తు చేయిస్తోంది. ఇటీవల భూపేష్ కుమారుడిని కూడా అరెస్ట్ చేశారు. అంటే, బిజెపి పాలిత రాష్ట్రంలో చోటు చేసుకున్న లిక్కర్ కుంభకోణం పై అక్కడి బిజెపి నాయకుల విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సిబిఐ, ఈడి విచారణ చేస్తూ అరెస్టులు కూడా సాగిస్తున్నాయి. మరి ఏపీ విషయానికి వస్తే వైసీపీ విషయంలో ఎందుకని ఇలా చేస్తున్నారు.. ఎందుకని కనీసం సిబిఐ ఈడి విచారణలో కూడా పట్టించుకోవడం లేదు. అనేది చర్చనీయాంశంగానే కాదు ఆసక్తిగాను మారింది. దీనికి ప్రధాన కారణం జగన్‌తో బిజెపి నాయకులకు ఉన్న సంబంధాలు. ముఖ్యంగా ప్రధానమంత్రి, అదే విధంగా హోం మంత్రి శాఖ మంత్రి రక్షణ శాఖ మంత్రి వంటి పెద్ద నాయకులతో జగన్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. దీంతో వారు దాదాపు 7 నెలల కిందటే సిబిఐ ఈడి విచారణలకు ఒప్పుకోలేదని తాజాగా ఆంగ్ల దినపత్రిక ఒకటి రాసుకువచ్చింది. సిబిఐ, ఈడి రాకపోవడానికి ప్రధాన కారణం కేంద్రం ఒప్పుకోకపోవడమేనని ఈ పత్రిక కథను స్పష్టం చేసింది. దీనిని బట్టి ఈ కేసులో సిబిఐ, ఈడి దర్యాప్తు ఇకపై ఉండబోదు. కేవలం రాష్ట్రంలో మాత్రమే అధికారులు దర్యాప్తు సాగించి విచారణను తేల్చాల్సి ఉంటుంది. మరోవైపు జగన్ జోలికి పోకుండా కూడా ఎవరో అడ్డుపడుతున్నారన్న చర్చ కూడా నడుస్తుంది. ఈ నేపథ్యంలో తెరవనుక రాష్ట్రంలోనే కాదు ఢిల్లీలో కూడా ఈ కేసు విషయంపై ఏదో జరుగుతుందన్న చర్చకు బలం చేకూరుతోంది. మరి ఇది ఎప్పటికీ తేలుతుంది ఎన్నాళ్లు పడుతుంది. అంతిమ ల లబ్ధిదారు ఎవరు అనే విషయాలు తేలాలంటే మరింత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. మొత్తానికి సిబిఐ ఈడి విచారణలు జరగకపోవడానికి కారణం కేంద్రమేనని తాజాగా వెలుగు చూసిన విషయం.

## జీఎస్టీ 2.0 సంస్కరణలకు సుస్వాగతం

2 లక్షల కోట్లు సమకూరుతుందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు చివరి వ్యక్తి వరకు అందేలా చేయడం మన బాధ్యత అని ప్రజా ప్రతినిధులకు సీఎం సూచించారు. దాని కోసం మంత్రివర్గ ఉపసంఘం నియమిస్తామని శాసనసభలో ప్రకటించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో జీఎస్టీ సంస్కరణలు ఊతమిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. జీఎస్టీ స్లాబుల మార్పుల వల్ల దేశంలోని 140 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. నూతన సంస్కరణల వల్ల ఏపీకి కొంత నష్టం ఉన్నా, దేశ విశాల ప్రజయోజనాల దృష్ట్యా స్వాగతిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రతినిధిగా బాధ్యత వహించా: దేశంలోని ప్రతి పౌరుడికి లబ్ధి జరిగేలా జీఎస్టీ సంస్కణరణలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పన్నుల భారం తగ్గడం ద్వారా ప్రజలకు ఆదాయం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అందుకే జీఎస్టీ 2.0కు ఆంధ్రప్రదేశ్ మద్ధతు ఇస్తోందని అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా పవన్ స్పష్టం చేశారు. జీఎస్టీ సంస్కరణలు దేశ ప్రగతికి బాటలు వేస్తాయని అన్నారు. జీఎస్టీ సంస్కరణల్లో ఒక దానికి రాష్ట్ర ప్రతినిధిగా బాధ్యత వహించినట్లు పవన్ తెలిపారు. సంస్కరణలను ముందుండి నడిపిన నిర్మలా సీతారామన్ కృషి అభినందనీయమని, రాష్ట్ర ఆదాయానికి నష్టం కలిగినా సామాజిక ప్రయోజనాల కోసం సమర్థించామని చెప్పుకొచ్చారు. చరిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గుర్తు చేశారు. జీఎస్టీ పన్ను విధానం సులభతరం ద్వారా ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరుతుందని, వ్యాపారులపై పన్నుల భారం తగ్గి, పన్నుల వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందన్నారు. ప్రజల పొదుపు పెంచి, కొనుగోలు శక్తి పెంపొందించేందుకు దోహదం చేస్తుందని అన్నారు. స్థిరమైన వృద్ధి మార్గంలో నిలపడానికి ఈ సంస్కరణలు ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. కొత్త పెట్టుబడులు పెంచి, ఆర్థిక వృద్ధికి దారి తీస్తుందని పవన్ వెల్లడించారు. జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూ ఏకగ్రీవ తీర్మానం: జీఎస్టీ మార్పులను స్వాగతిస్తూ అసెంబ్లీలో చర్చకు ముగింపుగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీర్మానం ప్రతిపాదించారు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించిన చంద్రబాబును అభినందిస్తూ తీర్మానాన్ని ప్రతిపాదించగా సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కేంద్ర తీసుకున్న నిర్ణయం పై జీఎస్టీ కౌన్సిల్?లో ఏపీ అభిప్రాయాన్ని చెప్పడానికి ముందు జరిగిన పరిణామాలను కేశవ్ సభకు వివరించారు. జీఎస్టీ సంస్కరణలతో ఏపీకి 8 వేల కోట్ల ఆదాయం తగ్గుతుందని తాను చెబితే, చంద్రబాబు మాత్రం ప్రజలకు 8 వేల కోట్లు మిగులుతాయని వ్యాఖ్యానించినట్లు తెలిపారు.

## మెరుగైన సేవలు అందిద్దాం

ఎవరైనా వాటిని నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. చెడు నడతగల వ్యక్తులపై నిఘా వుంచాలని వారి కదలికలను, దైనందిన జీవన విధానాన్ని, వారు చేసే పనులను పరిశీలించి, ఏవైనా అనుమానిత చర్యలు ఉంటే వెంటనే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగాఅందిపుచ్చుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయడంతో పాటు, గంజాయి మాదకద్రవ్యాల నిర్మూలనలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదు దారుల పట్ల మర్యాదపూర్వకంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించి, చట్టపరిధిలో వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. ఒకే సమస్య పునరావృతం కాకుండా చట్టపరిధిలో సరైన పరిష్కారాన్ని చూపించాలని, మహిళ మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. డయల్ 112, శక్తి కాల్ సెంటర్ కి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల శ్రద్ధ వహించి, సాధ్యమైనంత త్వరగా ఆ కాల్ కి స్పందించి, పోలీస్ వారి వెంటనే స్పందించారనే భరోసాను బాధితులకు కల్పించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ లో పలు రిజిస్టర్, కేసు డైరీ ఇతర రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పోలీస్ అధికారులు ఆదేశించారు. ఏదైనా కేసుకు సంబంధించి ఆధారాలను జాగ్రత్తగా భద్రపరచాలని, అదే విధంగా కేసుల దర్యాప్తు సక్రమంగా సమగ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సీసీటీఎన్ ఎస్ లో ఎఫ్ ఐ ఆర్ మొదలు కేసు డిస్పోజల్ వరకు ప్రతి ఒక ఫైల్స్ ను అప్లోడ్ చేయాలని సూచించారు. తరచుగా గ్రామాలు/వార్డులను సందర్శిస్తూ విజిబుల్ పోలీసింగ్, ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ డ్రైవ్ వంటి కార్యక్రమాలను నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుని, వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును సమీక్షించాలని, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచాలన్నారు. విధి నిర్వహణ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తన దృష్టికి తీసుకువచ్చి తగిన పరిష్కారాన్ని పొందాలన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, అక్కడ వైరల్ అయ్యే సమాచారం నిజనిజాల ప్రకారమే ఉండేలా చూడాలని, అలాగే పోలీస్ అధికారులు విధులు నిర్వర్తించే తీరు ప్రజల్లో నమ్మకం కలిగించేలా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీనివాసరావు, డిఎస్పిలు ఆర్.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, కె. శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## కనిగిరి అభివృద్ధే ధ్యేయం

ఎదుర్కొంటున్న ఇబ్బందు లను ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. పలు ప్రధాన రహదారుల నిర్మాణం, పాడైపోయిన రోడ్ల మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశా రవాణా సౌకర్యాలు మెరుగుపడితే ప్రజలకు సౌకర్యం కలుగుతుందని ఇందుకు సహకరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి, కనిగిరి ప్రాంత అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

## కనిగిరి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### గ్రామాలలో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి : తహశీల్దార్ రవి శంకర్



**కనిగిరి, ప్రజలకు చేరువ**

ప్రకాశం జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్నందున కనిగిరి చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తం ఉండాలని కనిగిరి తహసీల్దార్ రవి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కనిగిరి ప్రాంతంలో వర్షంతోపాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగిన యడల వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ప్రజలు ఏదైనాసహాయం కోరిన యడల తక్షణమే సహాయం చేయుటకు తాము ఎప్పుడు అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు

## ఇరిగినేని జయంతిని
# జయప్రదం చెయ్యండి

జిల్లాలోని ఇరిగినేని అభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలి

పిలుపునిచ్చిన ఇరిగినేని అభిమానులు

నేటికీ వెలుగులోకి వచ్చిన పెద్దాయన అభిమానులు



**కనిగిరి, ప్రజలకు చేరువ :** ఈనెల 20వ తేదీ జరిగే కనిగిరి మాజీ ఎమ్మెల్యే అందరి అభిమాన నాయకుడు పెద్దాయన ఇరిగినేని తిరుపతి నాయుడు జయంతిని జయప్రదం చెయ్యాలని ఇరిగినేని ప్రియ శిష్యుడు వెంకట నరసయ్య ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా ఉదయం 10:30 కి కనిగిరిలో పామూరు బస్టాండ్ లో చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించి. అనంతరం గవర్నమెంట్ హాస్పటల్లో ఉన్న రోగులకు మరియు కనిగిరి కొత్తూరులో ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న బధిరుల పాఠశాల నందు పండ్లు బ్రెడ్లు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా మరియు నియోజకవర్గంలో ఉండే ఇరిగినేని అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని ఆయన కోరారు. కనిగిరి నియోజకవర్గంలో పెద్దాయన అని ఆప్యాయంగా పిలిచే వ్యక్తి స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు. ఆయన మరణించిన ఆయన అభివృద్ధి ఫలాలు నియోజకవర్గం ప్రజలల్లో ఇంకా మెదులుతూనే ఉన్నాయి. ఆయన ద్వార ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగిన కొందరు ఆయనను మరిచి పోయారు. కాని కొందరు వారి వారి రాజకీయ లబ్ధికోసం ఆయన విగ్రహానికి పూలమాల వేసి కంట్టితుడుపు చర్యగా కార్యక్రమాలు చేస్తున్నారు. కాని చాలాకాలం తరువాత ఆయన అభిమానులు ఈసారి ఇరిగినేని జయంతిని నిర్వహించటం మంచి పరిణామమని చెప్పవచ్చు.

## కాలిబాటల ఏర్పాటుతో
# సుడి దోమ నివారణ

వ్యవసాయ అధికారిని కృష్ణవేణి



**చీడికాడ, ప్రజలకి చేరువ ప్రతినిధి :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరి పంటపై సుడిదోము ఆశించి నష్టం కలుగ చేస్తుందని మండల వ్యవసాయ అధికారిని కృష్ణవేణి తెలిపారు. గురు వారం ఆమె మండలంలోని సుడిదోమ సోకిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వరి పంటలో మచ్చులు అడుగున నీటిమట్టంపై ఉండి దుబ్బుల నుండి రసాన్ని పిల్చటం వలన పైరు సుడులు, సుడులుగా ఎండిపోతుందన్నారు. పైరు మొదలు పసుపురంగులోకి మారి ఉదృతి ఎక్కువైన కొద్ది ఎండిపోవటం జరుగుతుందన్నారు. ఈ పురుగు ఉధృతిని నివారించుటకు ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు వదలాలన్నారు. పొలంలో నీటిని తీసివేసి సాయంత్రం సమయంలో మందు పిచికారి చేయడం వలన పురుగును నివారించవచ్చు అన్నారు. పొలంలో నీరు నిలవలేకుండా ఎప్పటికప్పుడు పొలం నుండి నీరు తీసివేసి, పొలాన్ని అడపా దడప ఆరబెట్టాలన్నారు. సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే నత్రజని ఎరువులు వాడాలనీ. దోమ ఉద్నతి ప్రారంభదశలో ఉన్నప్పుడు ఎసిఫేట్ 75 %ంజూ% ఎకరాకు 300 గ్రాములు, ఇమిడాక్లోప్లీడ్ ం ఎథి ప్రోల్ 60 ఎన్ జి మరియు 50 గ్రాములు వాడి నియంత్రించవచ్చన్నారు. దోమ ఉధ్యత ఎక్కువగా ఉన్నాప్పుడు పైమెట్రోజైన్ 50 ఎంజి 120 గ్రామ.. డైనో టెఫ్యురాన్ 20 ఎస్సీ 80 గ్రాములు లేదు బ్రైట్లు మీచీ పైరియు 10. 96 మిల్లీలీటర్లు,ఎకరాకు పిచికారి చేయడం ద్వారా దోమ ఉదృతిని నియంత్రించవచ్చనీ. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు తూటికాడ రసాన్ని పిచ్చిగారి చేయడం ద్వారా సుడిదోమ ఉధృతిని నివారించవచ్చు అన్నారు.

## పేద ఆర్యవైశ్య మహిళ
# వైద్యానికి విపిజి సాయం






**కందుకూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** కందుకూరు పట్టణం కాళిదాసు వారి వీధిలో నివాసం ఉంటున్న నాగసూరి శ్రీలక్ష్మి అనే పేద ఆర్యవైశ్య మహిళ గత కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడు తున్నారు. ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందుల వలన వైద్యం నిమిత్తం దాతల కోసం ఎదురుచూస్తున్నారు. కందుకూరు పట్టణానికి చెందిన వేముల సుకుమార్ గుప్తా (వి.పి.జె. జ్యువెలరీ) ఆర్యవైశ్య మిత్రుల ద్వారా ఈ విషయం తెలుసుకొని గురువారం ఆమె వైద్యం నిమిత్తం రూ 10,000/-లు నగదును, నగదు తో పాటు పసుపు కుంకుమలతో చీరను అందజేశారు. ఈ సందర్భంగా వేముల సుకుమార్ గుప్తా మాట్లాడుతూ తోటి వారు ఇబ్బందుల్లో ఉంటే వారికి సహాయం చేయటం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ నాగసూరి శ్రీలక్ష్మి మహమ్మారి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రికి వెళ్ళటానికి కూడా ఖర్చులకు లేని స్థితిలో ఉన్నారని వారి కుటుంబ సభ్యుల ద్వారా మేము తెలుసుకొని ఆమెకు ఆర్థికంగా సహాయం చేయాలని కందుకూరు ఆర్యవైశ్యులకు తెలియజేసిన వెంటనే మంచి మనసుతో సేవాభావం ఉన్న విపిజి జువెలర్స్ యజమాని వేముల సుకుమార్ గుప్తా పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం ఎంతో మంచి కార్యక్రమం అని అన్నారు. కందుకూరు ఆర్యవైశ్యులు తమకు తోచిన విధంగా ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నారని కేశవరావు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి మంచి మనసుతో సాయం అందించాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబ సభ్యులు సుకుమారు గుప్తా కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్రులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, గుర్రం చిన్న అల్లూరయ్య, ఓరుగంటి శివ శంకర్ రావు పాల్గొన్నారు.

## నేడు ఛలోమెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని
# విజయవంతం చెయ్యండి

కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్



**కనిగిరి, ప్రజలకుచేరువ :** ఈనెల 19వ తేది అనగా నేడు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపార్టీ పిలుపు మేరకు తల పెట్టిన ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గురువారం ఒక ప్రకటలో కోరారు. జిల్లాపార్టీనాయకులు, విద్యార్థి మరియు యువజన విభాగాలతో కలిసి మార్కాపురం మెడికల్ కాలేజీ వద్దకు శాంతియుతంగా పెద్ద ఎత్తున తరలివెళ్లి వాస్తవ పరిస్థితులను మీడియా ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు ఆయన తెలిపారు. కావున కనిగిరి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## భాగ్యలక్ష్మిని పరామర్శించిన
# ఎమ్మెల్యే కందుల



**మార్కాపురం/పొదిలి ప్రజలకుచేరువ :** మంగళవారం తర్లపాడు మండలంలోని కలుజువ్వలపాడు గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మిని తన భర్త మరియు బాధితులురాలి అత్త రెండు చేతులు కట్టివేసి అతి ఘోరంగా హింసించిన విషయం పాఠ కులకు విధితమే. ఈ సంఘట నపై పోలీసులు స్పందించి కొందరిని అదుపులోకితీస ుకున్నారు. భాగ్యలక్ష్మి ప్రస్తుతం మార్కాపురం ప్రభుత్వవైద్య శాలలో చికిత్సపొందుతుంది. ఈ విషయం తెలుసుకున్న మార్కాపురం శాసనసభ్యుల ఆమెను పరామర్శించి ధైర్యంచెప్పి ఆర్థిక సహాయం అందజేశారు. ఆమే ఆరోగ్యస్థితి గతులను స్థానిక వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## జయన్న మృతికి
# సిపిఎం పార్టీ సంతాపం



**హనుమంతునిపాడు /కనిగిరి ప్రజలకు చేరువ**

హనుమంతునిపాడు మండలం దాసల్లపల్లి గ్రామ సిపిఎం పార్టీ శాఖ సభ్యులు గూడూరు జయన్న అనారోగ్య కారణంగా మృతి చెందారు. గురువారం ఆయన పార్థివ దేహానికి పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లునివాళు లర్పించారు. మృతదేహంపై పార్టీ పతాకాన్ని ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ జయన్న 2005 నుండి పార్టీ ప్రజాసంఘాలతో సంబంధాలు కలిగి ఉన్నాడని తెలిపారు మండల కేంద్రంలో జరిగే అనేక ఉద్యమాలు పోరాటాల్లో పార్టీ పిలుపుల్లో ప్రజాసంఘాల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారన్నారు. తన ఆరోగ్యం బాగా లేకపోయినా పార్టీ పార్టీ కార్యక్రవ ాలను అడిగి తెలుసుకునే వాడని నేను మరణించేంతవరకు పార్టీ సభ్యుడు గానే కొనసాగుతానని అనారోగ్యం పేరుతో తన సభ్యత్వాన్ని రద్దు చేయొద్దని పార్టీపై తనకున్న ప్రేమను వ్యక్తపరిచిన విషయాన్ని బడుగు గుర్తు చేశారు. జయన్న సతీమణి మరియ మ్మకు, కుటుంబ సభ్యులకు పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో గూడూరు కొండయ్య, చిన్న, దానేలు, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కట్టవారిపాలెంలో
# పోషణ మాసోత్సవాలు





**కొండిపి ప్రజలకి చేరువ ప్రతినిధి**

అంగన్వాడి పోషణ మాస ఉత్సవాలలో భాగంగా కొండపి మండలం కట్టవారిపాలెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గర్భవతులు బాలింతలు కిశోర బాలికలు సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. సిడిపిఓ సుశీల దేవి మాట్లాడుతూ గర్భవతులు ఆకుకూరలు కాయ కూరగాయలు తీసుకొని జింక్ ఫుడ్ కూరల్లో ఉప్పు చక్కెర నూనె వాడకం తగ్గించాలని వ్యాయాయం తప్పకుండా చేయాలని అలా చేసిన వారు ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఓ తెలిపారు అంగనవాడి స్కూల్లో చిన్నారులకు క్రమం తప్పకుండా ఎత్తు బరువు చూడాలని అంగన్వాడీ టీచర్లను ఆదేశించారు ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుశీల దేవి, సూపర్వైజర్ విక్టోరియా రాణి, అంగన్వాడీ టీచర్లు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జనసేన నేతను సన్మానించిన
# సొసైటీ సభ్యులు




**కొండిపి ప్రజలకి చేరువ ప్రతినిధి :** ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గంలోనీ సింగరాయ కొండ మండలంలో జనసేన పార్టీ కార్యాలయంలో కనుమళ్ళ సొసైటీ సభ్యులు జనసేన పార్టీ నాయకులు కూనపురెడ్డి రంగారావు, కొండేపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్, సింగరాయకొండ మండల అధ్యక్షులు ఐనాబత్తిన రాజేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కనుమళ్ళ సొసైటీ సభ్యులుగా అవకాశం కల్పించినందుకు పవన్ కళ్యాణ్, షేక్ రియాజ్, కనపర్తి మనోజ్ కుమార్, ఐనాబత్తిన రాజేష్, కూనపురెడ్డి రంగారావు,లకు ధన్యవాదాలు తెలిపారు.

## స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్
# అభియాన్‌కు విశేష స్పందన





**పొదిలి, ప్రజలకు చేరువ :** పొదిలి నగర పంచాయతీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ శరత్‌చంద్ర, శివ పార్వతి ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేకంగా ఈ కార్యక్రమం జిల్లాలో కొనసాగునుంది. మహిళల ఆరోగ్య పరిరక్షణ, రక్తహీనత నివారణ, క్షయవ్యాధి గుర్తింపు, పోషకాహార లోపాల నియంత్రణ వంటి అంశాలపై స్థానిక వైద్యులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళలతో పాటు అంగన్వాడీ సిబ్బంది కూడా చురుకుగా పాల్గొన్నారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన మహిళే సశక్త కుటుంబానికి మూలమన్నారు. ప్రతి మహిళ తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ శిబిరాలు ఎంతో ఉపయుక్తం అని సూచించారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల ఎన్డిఏ కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విజయవంతమైన స్వస్థనారి
# స్వసక్త పరివార అభియాన్





**కొండపి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం( స్వస్థ నారి సశక్త పరివార్ అభియాన్ ) కార్యక్రమాన్ని పెట్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆరితోటి ఝాన్సీ రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి పుట్టినరోజును పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఈనెల 17 నుండి వచ్చేనెల 2 వరకు 15 రోజులపాటు జరిగే ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం అనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని ఉద్దేశంతో స్వస్థనారి సశక్త అభియాన్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింద న్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, విలేజ్ హెల్త్ క్లినిక్ లో స్పెషలిస్టు క్యాంప్ ద్వారా వైద్య శిబిరా లను ఏర్పాటు చేసి రెఫర్ కాబడిన వారికి స్పెషలిస్ట్ డాక్టర్లతో మహిళలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. సిడి స్క్రీనింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్, మాత శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, రక్తహీనత స్క్రీనింగ్, టీ.బీ స్క్రీనింగ్, రుతు శుభ్రత, అభాఐడి, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందనీ. ప్రజలందరు ఈ ప్రత్యేక వైద్య శిబిరాలలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకో వాలని సూచించారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. వాణిశ్రీ, ఆరోగ్య విస్తరణాధి కారి పి.మోహన్ రావు కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఐ.ప్రియాంక, కొండపి సామాజిక ఆరోగ్య కేంద్రం చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. నిఖిల్ దీప్ అంగన్వాడీ టీచర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 30 లోపు ఈ పంట
# నమోదు పూర్తి చేయాలి

ఏడిఏ నిర్మల కుమారి







**పొన్నలూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** సింగరాయకొండ సబ్ డివిజన్ పరిధిలోని కొండపి, సింగరాయకొండ, జరుగుమల్లి, పొన్నలూరు నాలుగు మండలాలోని వ్యవసాయ శాఖ సిబ్బంది కి కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఏడిఏ. ఈ నిర్మలా కుమారి ఆధ్వర్యం లో నిర్వహించారు. సిబ్బంది అందరూ సెప్టెంబర్ 30 లోపు ఈ – పంట పూర్తి చేయాలని సిబ్బంది నీ ఆదేశించారు. ఈ కార్యక్రమంనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్,ఒంగోలు ఎం రజనీ కుమారిమాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో సాగు చేయు పంటల మీద సమగ్ర సస్య రక్షణ చర్యలు పై తెలియపరిచారు. వివిధ రకాల పంటల్లో వచ్చే తెగుళ్ళు, పురుగులు గురించి ఏపీఎయిమ్స్ 2.0 యాప్‌లో ఎలా అప్లోడ్ చేయాలో రైతులకు సమాచారం ఎలా తెలియచేయాలనే విషయాన్ని కులంకుశంగా వివరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా కెవికె శాస్త్రవేత్త ఐ.వెంకటేశ్ పెట్లూరులో కంది, వరి పైరు లను పరిశీలించి కంది పంట లో వెర్రి తెగులు, వరి లో పాముపోడ తెగులు గుర్తించి, నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లో డి ఆర్ సి ఒంగోలు ఏవోలు శైలజ, శేషమ్మ , కొండపి ఏవో ఏం మాల్యాద్రి, బిటియం షరీఫ్, ఏఈఓ కుమార్, బి ఏ ఏ ఎస్ కొండలరావు, మీరావళి, ఏపీ సీఎం ఎఫ్ మాధవరావు రైతులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యమే
# కుటుంబ ఆరోగ్యం
### మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్



**కనిగిరి, ప్రజలకు చేరువ :** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందని తద్వారా రాష్ట్రం బాగుంటుందని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు.స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కనిగిరి పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ నందు గురువారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కొరకు స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని అన్నారు.మంచి ఆరోగ్యం కోసం చక్కెర, ఉప్పు, నూనె వాడకాలను తగ్గించాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ప్రతి మహిళ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.ఈ సందర్భంగా సిహెచ్‌సి సూపర్డెంట్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్ తిరపతి రెడ్డి మాట్లాడారు.సెప్టెంబర్ 17 అక్టోబర్ 2 తేదీ వరకూ 15 రోజుల పాటు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ ఫణి కుమార్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు,ఎ ఎన్ ఎం లు,వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్జ్ భూమిని పరిశీలించిన
# జాయింట్ కలెక్టర్ గోపాల్ కృష్ణ



పామూరు /కనిగిరి ప్రజలకు చేరువ : పామూరు మండలం మాలకొండాపురం గ్రామంలో ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల్ కృష్ణ గురువారం పర్యటించారు. నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటు చెయ్యడంకోసం ఎపిఐఐసి లిమిటెడ్ అభ్యర్ధన మేరకు 850 ఎకరాల 67 సెంట్ల భూమిని ఆయన పరిశీలించారు. ఈయన వెంట కనిగిరి ఆర్డీఓ కేశవవర్ధన్ రెడ్డి, పామూరు మండల తహసీల్దార్ వాసుదేవరావు, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.





## ఉప్పలపాడు పంచాయతీ
# పరిశీలించిన డిపిఓ

కొండపి ప్రజలకి చేరువ ప్రతినిధి : మండలంలోని కె ఉప్పలపాడు గ్రామ పంచాయతీ నీ జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు గురువారం ఆకస్మితంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ లలో చెత్తను ఎప్పటికి కప్పుడు సేకరించి వర్మీ కంపోస్ట్ గా మార్చాలని తడి చెత్త పొడి చెత్త గురించి ప్రజలకు అవగహన కల్పించారు. ఐ వి ఆర్ ఎస్ విలేజ్ లకు సంబంధించి ఫోన్ కాల్స్ గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో, ప్రకాశం పారిశుధ్య పనులలో ముందు ఉండేలా పంచాయతీ అధికారు తగు చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ సిబ్బంది సచివాలయం సిబ్బంది అందరూ చెత్త గురించి గ్రామ ప్రజ లకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ లలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రోడ్ల పరిస్థితి మొదలైన వాటి పై గ్రామ పంచాయతీ అధికారులు పంచాయతీ అభివృద్ధి కి కృషి చేయాలని సూచించారు. ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ బాగుండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి లకు తెలిపారు, ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ లను తనిఖీ చేసారు. యత్రలు నాడేపల్ లు పరిశీలించారు. ఇతర సిబ్బంది పనితీరు, పరిపాలన సిబ్బంది సమస్యలు గురించి అడిగి తెలుసుసున్నారు. ఈ కార్యక్రమం లో మండల అభివృద్ధి అధికారి బి. రామాంజినేయాలు ఒంగోలు డీపీవో చక్రదర్ మండల ఆర్ పి అశోక్ డిప్యూటీ ఎంపీడీఓ అంజలీ దేవి, గ్రామ నాయకులు రామూర్తి నాయడు, పంచాయతీ కార్యదర్శి పుష్ప లత, సచివాలయం సిబ్బంది క్లాప్ మిత్ర పాల్గొన్నారు.



# చిన్నారులే అంగన్వాడీ కేంద్రాలకు పునాది
### కందుకూరు సిడిపిఓ ఉషారాణి



**కందుకూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** అంగన్వాడి కేంద్రాలకు చిన్నారులే పునాదులని వారిని జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులు, కార్యకర్తలు, సిబ్బంది ప్రతి ఒక్కరిపై ఉంటుందని కందుకూరు సిడిపిఓ ఉషారాణి అన్నారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహార లోపం లేని చిన్నారులను తయారు చేయడమే ప్రధాన లక్ష్యంగా అనేక పథకాలను తీసుకువచ్చిందని వాటిని సక్రమంగా గర్భవతులు, బాలింతలు వినియో గించుకునేలా అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని ఆమె కోరారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16వరకు 8వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వాటిని సూపర్వైజర్లు విధిగా నిర్వహించాలని ఆమెకు తెలిపారు. పోషక విలువలు ఉన్న పౌష్టికాహారానికి సంబంధించిన ఆహార పదార్థాలను వాటి యొక్క విలువలను గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించి పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునే ముఖ్య ఉద్దేశమే రాష్ట్రీయ పోషణ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో కార్యకర్తలు సమయపాలన పాటిస్తూ తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సూపర్వైజర్లు షకీలా, లక్ష్మీదేవమ్మ, వలేటివారిపాలెం సూపర్వైజర్ సునీత పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యల
# పరిష్కారం చేయాలి



**పొదిలి, ప్రజలకు చేరువ :** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి బండి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక పొదిలి మున్సిపల్ కార్యాలయం దగ్గర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.ఈ ధర్నాలో కోటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 17 రోజులు సమ్మె జరిగిందని ఆ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పిస్తామని, 62 సంవత్సరాల వయోపరిమితి పెంచుతామని, కుటుంబంలో అర్హత ఉన్న ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని, పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే 7 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా, దహన సంస్కారాలకు 20,000 వేలు ఇస్తామని ఇచ్చిన హామీలను నేటి ప్రభుత్వం జీవోలు రూపంలో ఇచ్చి అమలు చేయాలన్నారు. 2025 జూలైలో జరిగిన ఏడు రోజులు సమ్మె కాలపు జీతం ఇవ్వాలన్నారు.సమస్యలు పరిష్కారం కాకపోతే ఈనెల 23వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు.ఈ ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి సుబ్బయ్య, కె.వి నరసింహం, జి నాగేశ్వరరావు, బి కోటేశ్వరమ్మ, పి నాగేంద్రం , ఎస్ జార్జి, సిహెచ్ నాగరత్నం, మేరీ ,చిన్నక్క, టీ బుజ్జి, హజరత్తమ్మ, బైరాగి అంజమ్మ, యోహాను, ఏడుకొండలు, చిన్నయ్య, పోలేరమ్మ లు పాల్గొన్నారు.

# కింగ్ సెంచరీ ఫిక్సైంది!



కింగ్ నాగార్జున 100వ చిత్రం తమిళ దర్శకుడు రా.కార్తీక్ తో లాక్ అయిన సంగతి తెలిసిందే. కార్తీక్ తెరెక్కిం చింది ఒక్క సినిమాతో అయినా? కంటెంట్ పై నమ్మకంతో అవకాశం కల్పించారు. కొన్ని నెలలుగా జరుగు తోన్న స్టోరీ ప్రోసస్ ని నాగ్ ఒకే చేయడంతో ఫైనల్ గా ప్రాజెక్ట్ లాక్ అయింది. ఇది పూర్తిగా యాక్షన్ అండ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా ఉంటుందని లీకులందుతున్నాయి. ఫ్యామిలీ కథకు యాక్షన్ అంశాన్ని జోడించి అందులో వైవిధ్యను చూపించే ఆస్కారం ఉంది. వందవ సినిమా విషయంలో నాగ్ ఎంత మాత్రం రిస్క్ తీసుకోకుండా సేఫ్ జోన్ లోనే చేయాలి? అన్న ఉద్దేశంతో కలిసొచ్చిన పాయింట్ నే కథ వస్తువుగా తీసుకుంటున్నారు.

**సొంత నిర్మాణంలోనే కింగ్ :** ప్రయోగాలు చేసినా ఫెయిలైన ప్రతీసారి నాగ్ కెరీర్ ని పట్టాలెక్కించింది ఈ జానర్ కథలు కావడంతోనే అంత కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఈ సినిమా మాత్రం గ్రాండ్ గా ఉంటుంది. నాగార్జున సొంత బ్యానర్లోనే నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 100 నాటౌట్ అనే టైటిల్ పరిశీలనలో ఉంది. అయితే ఆ ప్రాజెక్ట్ ప్రకటించిన నాటి నుంచి ప్రారంభోత్సవంపై ఆసక్తి నెలకొంది.

**ఇద్దరు బిగ్ స్టార్స్ అతిథులుగా :** ఎప్పుడు ప్రారంభమవుతుందంటూ నాగ్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా అడుగుతూనే ఉన్నారు. కానీ ఏనాడు వాటిపై స్పందించలేదు. అయితే ఈ చిత్రాన్ని దసరా సందర్భంగా లాంచ్ చేసే ప్లాన్ లో ఉన్నట్లు తెలిసింది. లాంచింగ్ ముహూర్తం కూడా పెట్టినట్లు సమాచారం. వందవ సినిమా కావడంతో మెగా స్టార్ చిరంజీవి అతిథిగా ఆహ్వానించి ఆయన చేతుల మీదుగా ప్రాజెక్ట్ ని లాంచ్ చేయాలని కింగ్ భావిస్తున్నారుట. ఆయనతో పాటు మరో ఇద్దరు స్టార్లను కూడా అతిథులుగా ఆహ్వానించబోతున్నారుట.

# అతిలోక సుందరిని తలపిస్తున్న నభా



సినిమా ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ సమయంలో మంచి పేరు తెచ్చుకున్న హీరోయిన్లలో నభా నటేష్ కూడా ఒకరు.. ఈ హీరోయిన్ తన అమాయకపు చూపులతో.. అందాలతో సినిమాల్లోనే కాదు సోషల్ మీడియాలో కూడా ఫాలోవర్స్ ని పెంచుకుంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా షేర్ చేసిన ఫోటోస్ చూస్తే కుర్రకారు మతి పోవాల్సిందే. పసుపు రంగు చీరలో ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోస్ సోషల్ మీడియాలో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారాయి. ఈ ఫొటోస్ షేర్ చేసిన కొద్ది క్షణాల్లోనే వేలల్లో లైకులు, వందల్లో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. అలా తాజాగా అతిలోక సుందరిని తలపిస్తూ.. పసుపు రంగు చీరలో ఉన్న నభా నటేష్ ఫొటోస్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి.. ఎల్లో కలర్ నెట్టెడ్ ఫ్యాబ్రిక్ తో ఉన్న శారీని కట్టుకున్న నభా నటేష్.. స్లీవ్ లెస్ బ్లౌజ్ లో ఉబికి వస్తున్న పరువాలతో కుర్రకారుకి మత్తెక్కిస్తోంది.. ఈ ఫోటోలు చూసిన చాలామంది నెటిజన్లు, ఆమె అభిమానులు ఫైర్ ఎమోజిని షేర్ చేస్తూ చాలా హాట్ గా ఉన్నావంటూ కామెంట్లు పెడుతున్నారు. మరి కొంతమందేమో నువ్వు ఎలా రెడీ అయినా సరే బుట్ట బొమ్మవే.. రోజురోజుకీ నీపై అభిమానం పెరిగిపోతుందని, ఇంకొంతమందేమో ఈ చీరకట్టులో నిన్ను చూస్తే చెమటలు పట్టేస్తున్నాయ్ అంటూ ఇలా ఎవరి స్టైల్ లో వాళ్లు కామెంట్స్ పెడుతున్నారు.. నభా నటేష్ కెరియర్ విషయానికి వస్తే.. 2015లో కన్నడ ఇండస్ట్రీ ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి నభా నటేష్ కన్నడలో రెండు మూడు సినిమాలు చేసి, ఆ తర్వాత సుధీర్ బాబు హీరోగా చేసిన 'నన్ను దోచుకుందువటే' అనే సినిమాతో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత రవిబాబు డైరెక్షన్లో వచ్చిన ఫాంటసీ కామెడీ 'అదుగో' మూవీలో కూడా నటించింది. కానీ ఈ రెండు సినిమాలు నభా నటేష్ కి కలిసి రాలేదు. ఇక పూరీ జగన్నాథ్ డైరెక్షన్లో రామ్ పోతినేని హీరోగా వచ్చిన ఇస్మార్ట్ శంకర్ మూవీతో నభా నటేష్ దశ తిరిగిపోయింది. ఈ సినిమా హిట్ తో నభా నటేష్ కి వరుస ఆఫర్స్ వచ్చాయి. అలా డిస్కో రాజా, సోలో బతికే సో బెటర్ వంటి సినిమాలు చేసింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ నిఖిల్ హీరోగా చేస్తున్న పాన్ ఇండియా మూవీ 'స్వయంభు' లో హీరోయిన్ గా నటిస్తోంది.



# భారతీయుడు-3 సంగతి అంతేనా?

విశ్వనటుడు కమల్ హాసన్, ప్రముఖ దర్శకుడు శంకర్ కాంబినేషన్ లో రూపొందిన భారతీయుడు–2 మూవీ గత ఏడాది రిలీజైన విషయం తెలిసిందే. 1996లో వచ్చిన సూపర్ హిట్ చిత్రం భారతీయుడు కు సీక్వెల్ గా తెరకెక్కిన ఆ సినిమా.. మంచి అంచనాల మధ్య రిలీజ్ అయింది. కానీ భారీ డిజాస్టర్ గా నిలిచి విమర్శలు ఎదుర్కొంది. ముఖ్యంగా ట్రోలర్స్ కు మీమ్స్ స్టఫ్ గా మారింది. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా అటు నిర్మాతలకు ఇటు సినిమాను కొనుగోలు చేసిన బయ్యర్స్ కు తీవ్ర నష్టాలు మిగిల్చింది. అయితే ఇండియన్ 2ను మొదట ఒక సినిమాగా ప్లాన్ చేశారు శంకర్. కానీ దాని ఎక్కువ రన్ టైమ్ కారణంగా, దీనిని రెండు భాగాలుగా తీసుకొస్తున్నట్లు తెలిపారు. అందుకే పార్ట్–3 ట్రైలర్‌తో పార్ట్–2 మూవీ క్లోజ్ చేశారు. అయితే ఆ ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంది. కానీ సినిమా రిలీజ్ అవుతుందో లేదోనని కొన్ని రోజులుగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. థియేటర్స్ లోకి సినిమా రాదని, ఓటీటీలో రిలీజ్ అవుతుందని ప్రచారం జరిగింది. కానీ థియేటర్స్ లోనే రిలీజ్ అవుతుందని శంకర్ తెలిపారు. ఆ తర్వాత సినిమా మిగతా పార్ట్ షూటింగ్ జరగదని, రద్దు అయినట్లేనని వార్తలు వచ్చాయి. ముఖ్యంగా సినిమా నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ప్రాజెక్టు నుంచి తప్పుకుందని టాక్ వినిపించింది. ఇంకా షూటింగ్ పెండింగ్ ఉండడంతో తమ వల్ల కాదని ఇండియన్ 3 సినిమాను పూర్తిగా పక్కన పెట్టినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. కానీ ఆ తర్వాత లైకా ప్రొడక్షన్స్ ఇండియన్ 3 పై మళ్లీ వర్క్ ను తిరిగి ప్రారంభిస్తుందని, రెడ్ జెయింట్ ప్రొడక్షన్స్ సంస్థ భాగస్వామిగా చేరుతుందని ఊహాగానాలు వచ్చాయి. ఇప్పుడు మళ్లీ భారతీయుడు–3 ఆగిపోయిందని టాక్ వస్తోంది. లైకా ప్రొడక్షన్స్ తన ఒప్పందాన్ని ఉపసంహరించుకుందని జోరుగా ప్రచారం జరుగుతోంది.

PRINTED,PUBLISHED AND OWNED BY NARALA MURALI PRINTED AT SUNDAY PRINTING PRESS, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. AND PUBLISHED FROM H NO. 5-212-4, KOTTURU , KANIGIRI, PRAKASAM, ANDHRA PRADESH - 523230 RNI NO : APTEL 2020/80178. CELL : +91 891 934 5606 EDITOR : KUMAR